క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటనెన్స్‌లో భాగంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వెల్దుర్తి, శేరీల, కుకునూర్, ఎల్కపల్లి, చెర్లపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం 1 నుంచి 4 వరకు నిలిచిపోతుందన్నారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

శివస్వాముల దీక్ష స్వీకరణ



శివదీక్ష స్వీకరిస్తున్న భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): గురుస్వామి ఎర్ర భాస్కర్ ఆధ్వర్యంలో శనివారం భక్తులు శివ దీక్షలను స్వీకరించారు. ఈ సందర్భంగా పేటలోని విఠలేశ్వరాలయంలో భక్తులకు గురుస్వామి మాలధారణ చేశారు. శివరాత్రి వరకు దీక్షలు కొనసాగుతాయని, దీక్షలు స్వీకరించిన భక్తులు నియమాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి అశోక్ తదితరులున్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలను ఆర్బీ ఎస్కే ఆధ్వర్యంలో వైద్యులు శ్రీనివాస్, దివ్య నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 8 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థుల్లో హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన ఐరన్ టాబ్లెట్లను అందజేస్తున్నామన్నారు. రక్తహీనత విముక్తా భారత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది యాదయ్య, మౌనిక, సౌందర్య, మండల నోడల్ అధికారి వెంకటేశం ఉన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మెదక్: పట్టణంలోని పోస్టాఫీస్ సమీపంలో గల లేబర్‌అడ్డాపై శనివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారు కళాజాత ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ ఏ విధంగా సోకుతుందని, అది రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు చామంతి, ఓంకార్, విధుమౌళి, పాపయ్య పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థపై అవగాహన



విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం పోలీస్‌స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హరీశ్‌గౌడ్ వారికి నేరాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో జరిగే గొడవలు ఇతర విషయాల్లో రక్షణ కోసం చేయాల్సిన ఫోన్ నంబర్లు, మహిళల రక్షణకు ఏర్పాటు చేసిన షీటీం గురించి తెలియజేశారు. పోలీస్ స్టేషన్‌లోని ఫిర్యాదుల విభాగం, రికార్డు గది, లాకప్ గది గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రవీందర్, రాంబాబు, కానిస్టేబుల్ భాస్కర్, రేణుక, ఉపాధ్యాయులు లక్ష్మణ్, రఘుపతి, చక్రధర్‌శర్మ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

దగ్ధమైన గుడిసె పరిశీలన



గుడిసెను పరిశీలిస్తున్న తహసీల్దార్ మన్నన్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రుద్రారం ఎస్సీ కాలనీలో ప్రమాదవశాత్తు దగ్ధమైన పూరిగుడిసెను తహసీల్దార్ మన్నన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఐ చంద్రశేఖర్ పంచనామా నిర్వహించారు. బాధితుడు మాసాయిపేట సంగయ్యకు ప్రభుత్వపరంగా అందాల్సిన సాయం అందిస్తామని తెలిపారు.

జీవన ఎరువు పంటలకు మేలు

కేవీకే శాస్త్రవేత్త రవికుమార్

కౌడిపల్లి(నర్సాపూర్): నేలలో ఉండి మొక్కలకు అందకుండా ఉండే భాస్వరాన్ని పీఎస్‌బీ జీవన ఎరువు వాడటంతో రైతులకు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ అన్నారు. రైతుల కోసం రవికుమార్ తెలిపిన వివరాలు..

పీఎస్‌బీ ఉపయోగాలు

- పీఎస్‌బీ (పాస్ఫరస్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియా) జీవన ఎరువు. మొక్కలకు అవసరమైన ప్రధాన పోషకాల్లో భాస్వరం ఒకటి. ఇది నేలలో ఉన్నప్పటికీ కొన్ని రకాల రసాయన చర్యలతో మొక్కలకు అందకుండా ఉంటుంది. పీఎస్‌బీ జీవన ఎరువును వాడటం వల్ల భూమిలో ఉండి మొక్కలకు అందకుండా ఉన్న భాస్వరాన్ని కరిగించి మొక్కలకు అందుబాటులోని తీసుకొస్తుంది. పీఎస్‌బీ వాడటంతో ఒక హెక్టార్ నేలలో 25 నుంచి 30 కిలోల భాస్వరాన్ని అందుబాటులోకి తెస్తుంది. భాస్వరం ఎరువుల మోతాదు లో 20 నుంచి 25 శాతం తగ్గించుకోవచ్చు. మొక్కల ఆరోగ్యంగా ఉండి పంటల దిగుబడి సైతం పెరుగుతుంది.

అన్ని రకాల పంటలకు వాడొచ్చు

- పీఎస్‌బీ జీవన ఎరువును వరి, చెరువు, పసుపు, పప్పు ధాన్యాలు, కూరగాయల తదితర పంటలకు వాడవచ్చు. ఈ సూక్ష్మజీవి కొన్ని రకాల ఆమ్లాలు, హార్మోన్లు, జీవ రసాయనాల వేర్ల ప్రాంతంలో ప్రవించడంతో నేలలో మొక్కలకు అందకుండా ఉన్న భాస్వరాన్ని కరిగించి మొక్కలకు అందేటట్లు చేస్తుంది. భాస్వరం ఎరువు వాడకాన్ని 20 నుంచి 25 శాతం వరకు తగ్గిస్తుంది.



నాట్లు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త రవికుమార్

విత్తన శుద్ధి

- కిలో విత్తనానికి 10మి.లీ చొప్పున పీఎస్‌బీ జీవన ఎరువును బెల్లం జిగట పదార్థము లేదా గంజి జిగట పదార్థంలో కలుపుకోవాలి. నీడలో ఆరబెట్టి తేమ లేకుండా అయిన తర్వాత పొలంలో విత్తుకోవాలి.

నారు వేర్లను ముంచే పద్ధతి

- రైతులు వరి పంటలో పీఎస్‌బీ వాటేటప్పుడు నారు వేర్లను పీఎస్‌బీలో ముంచి నాటు వేసుకోవాలి. దీనికోసం 10మి.లీ పీఎస్‌బీని లీటరు నీటిలో కలపాలి. వరిపొలంలో గుంత తీసి కాని, ప్లాస్టిక్ బ్యారల్‌లో కాని సిద్ధం చేసుకోవాలి. ఈ ద్రావణంలో వరి నారు వేర్లు మునిగేలా చూడాలి. 20 నిమిషాల తర్వాత నాటు వేసుకోవాలి.

తేమ ఆరిపోకుండా..

ఒక ఎకరాకు లీటరు పీఎస్‌బీ జీవన ఎరువును బాగా కుళ్లిన 200 కిలోల పశువుల ఎరువు లేదా సేంద్రియ ఎరువులో కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని కొద్ది మోతాదులో నీటిని చల్లుతూ తేమ ఆరిపోకుండా 15రోజుల వరకు ఉండనివ్వాలి. అనంతరం పొలంలో చల్లుకోవాలి. ఇలా చేయడంవల్ల పీఎస్‌బీ నేలలో కలిసిపోతుంది. నేలలో ఉండి మొక్కకు అందని భాస్వరాన్ని కరిగించి మొక్కలకు అందేలా చేస్తుందన్నారు. దీంతో రైతులు ఖర్చుతో పాటు నేల సారవంతంగా మారి రైతుకు మంచి దిగుబడి వస్తుంది.

విద్యా సదస్సు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



నాగ్సాన్‌పల్లి పాఠశాలలో విద్యా సదస్సు వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

పాపన్నపేట(మెదక్): టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మెదక్‌లో నిర్వహించే విద్యా సదస్సును విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగయ్య, వెంకట్‌రాంరెడ్డి అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో సందర్శించి విద్యా సదస్సుకు రావాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ సందర్భంగా నాగసాన్‌పల్లి పాఠశాలలో రంగయ్య మాట్లాడుతూ.. ఫిబ్రవరి 4న జిల్లా కేంద్రమైన మెదక్‌లో విద్యాసదస్సు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రోహిత్, ఎమ్మెల్సీ కోదండరాం, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అశోక్ కుమార్, నాగిరెడ్డిలు హాజరవుతున్నారని తెలిపారు. అనంతరం టీపీటీఎఫ్ విద్యామహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ దర్శిని ఎడిటర్ శశిధర్, సంఘం నాయకులు హీరాలాల్, గోపాల్, బాల్‌రాజు, రమేశ్, వీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల కొరత

అల్లాదుర్గం(మెదక్): గ్యాస్ సిలిండర్ కృతిమ కొరతతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం ఇంటి వద్దకే సరఫరా చేయాల్సిన గ్యాస్ సిలిండర్లను, డీలర్‌లు సక్రమంగా చేయకపోవడంతో సిలిండర్ కోసం అవస్థలు పడుతున్నారు. బ్లాక్‌లో సిలిండర్లు కొనాల్సిన దుస్థితి అల్లాదుర్గం మండలంలో చోటు చేసుకుంది. జోగిపేటకు చెందిన హెచ్‌పీ గ్యాస్ డీలర్ అల్లాదుర్గం మండలంలో సరఫరా చేస్తున్నారు. రెండు నెలలుగా సిలిండర్లను సక్రమంగా సరఫరా చేయడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిలిండర్‌పై రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తూ బ్లాక్‌లో అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్న సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి గ్యాస్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సంతలో బైక్ చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): సంతలో పార్కింగ్ చేసిన బైకును చోరీ చేసిన సంఘటన కొత్తపేట చౌరస్తా వద్ద శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. మండల పరిధిలోని లింగోజిగూడకు చెందిన ఎర్రోళ్ల ప్రవీణ్ శుక్రవారం కొత్తపేట చౌరస్తా సంతకు వెళ్లాడు. అక్కడ బైక్ పార్క్ చేసి కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెళ్లి వచ్చి చూస్తే బైక్ కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా.. బైక్ ఆచూకీ లభించలేదు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు తన పల్సర్ బైక్‌ను చోరీ చేశారని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రారంభానికి సిద్ధంగా పంచాయతీ భవనాలు



జాజితండాలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పంచాయతీ భవనం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్, జాజితండా గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలు ప్రారంభానికి సిద్ధం అయ్యాయి. జాజితండా గ్రామ పంచాయతీ కొత్తగా ఏర్పడటంతో పంచాయతీ భవనాల కోసం ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు చేసింది. దీంతో నిర్మాణం పూర్తి అయింది. రాయిలాపూర్‌లో పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరడంతో కొత్త భవనం కోసం సర్పంచ్ శేఖులు గ్రామస్తుల కోరిక మేరకు గత ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు చేసింది. నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు.

నేడు ప్రారంభం

రాయిలాపూర్, జాజితండా పంచాయతీ భవనాలను ఆదివారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు ఆయా గ్రామాల సర్పంచ్‌లు శేఖులు, రమేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమాగౌడ్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ స్నేహ బంద్ రామయంపేట సహకారంతో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో శనివారం మెడిసిటీ ఆస్పత్రి వారు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెడిసిటీ మార్కెటింగ్ ఇన్‌చార్జి సంజయ్, స్వామి వివేకానంద వ్యవస్థాపక అధ్యక్షుడు తమ్మలి రమేశ్ మాట్లాడుతూ.. వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చెవి, గొంతు, బీపీ, షుగర్, వరిబీజం, చర్మ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ ఆస్పత్రి వైద్య సిబ్బంది సుచిత్ర, జీత్రా, ఐశ్వర్య, వర్షిని, హారతి, హిందూ, రాజాగౌడ్, స్వామి వివేకానంద యూత్ సభ్యుడు మధు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

విద్యార్థులకు చేయూత



దాత అందించిన ప్లేట్లు, గ్లాసులతో విద్యార్థులు

శివ్వంపేట (నర్సాపూర్): మండల పరిధిలోని అల్లిపూర్ తండాలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు ఇదే తండాకు చెందిన లక్ష్మణ్ పవర్ శనివారం ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

వెల్దుర్తి(తూప్రాన్): అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్లు తులసీరాం, జ్ఞానజ్యోతి హెచ్చరించారు. ఈ మేరకు వెల్దుర్తి ఎంపీడీఓ కార్యాలయంలో ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు మాట్లాడుతూ.. హల్దీవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలించకుండా నిఘా పెంచాలన్నారు. అదేవిధంగా పలు గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలింపు కొనసాగుతందని, దానికి పూర్తిగా అడ్డుకట్ట వేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మట్టి, ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు యజమానులపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.



సమావేశానికి హాజరైన పంచాయతీ కార్యదర్శులు

బస్‌లను యథావిధిగా నడపండి



నర్సాపూర్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థులు

నర్సాపూర్‌రూరల్: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రం నుంచి బాలనగర్‌కు యథావిధిగా బస్‌లు నడపాలని నర్సాపూర్ డిపో మేనేజర్‌కు శనివారం విద్యార్థులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. నర్సాపూర్ డిపో బస్‌లను జిన్నారం నుంచి వయా కిష్టయ్యపల్లి, పోతారం, గాగిల్లాపూర్ మీదుగా బాలనగర్ వరకు నడిపేవారని చెప్పారు. కాగా కొన్ని రోజులుగా బస్‌లను నడపకపోవడంతో నిత్యం పాఠశాల, కళాశాల విద్యార్థులతో టు కంపెల్లో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రద్దు చేసిన బస్‌లను వెంటనే పునరుద్ధరించాలని విద్యార్థులు కోరారు.

పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలి



బహుమతులు అందిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

చేగుంట(తూప్రాన్): విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఎంపీపీ మాసుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన బోర్‌మోటారు ఎంపీపీ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను అందించి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు గంగాబాయి, నాయకుడు జ్ఞానేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కోదండరాంను కలిసిన నార్సింగి నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియామకం అయిన ప్రొఫెసర్ కోదండరాంను నార్సింగి మండల కాంగ్రెస్ నాయకులు కలిసి అభినందలు తెలిపారు. శనివారం హైదారాబాద్‌లోని కోదండరాం నివాసంలో కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మండలం నర్సంపల్లికి చెందిన టీజేఎస్ జిల్లా నాయకుడు బాల్‌రాజ్‌గౌడ్, శేరిపల్లికి చెందిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్దన్, కాంగ్రెస్ మండల నాయకుడు కృష్ణాగౌడ్ కలిసి అభినందించారు. వీరితో జేఏసీ నాయకుడు యాదగిరి ఉన్నారు.



ఎమ్మెల్సీగా నియామకమైన కోదండరాంను సన్మానిస్తున్న నాయకులు

అంజన్న సన్నిధిలో భక్తుల పూజలు



ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

శివంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్ల అరణ్యంలో కొలువైన సహకార ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సత్యనారాయణ స్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. ఆలయ ప్రాంగణంలో కొలువైన సీతారామచంద్రస్వామిని సైతం దర్శించుకొని భక్తులు పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ సార శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయ శర్మ, ప్రధాన అర్చకులు దేవదత్త శర్మ, ప్రభు శర్మ దేవిశ్రీ, సిబ్బంది ఉన్నారు.

గ్రామానికి సేవ చేయడం అదృష్టం

పెద్దచింతకుంట సర్పంచ్ శివకుమార్

నర్సాపూర్ రూరల్: గ్రామానికి సేవ చేయడం అదృష్టమని మండలంలోని పెద్దచింతకుంట సర్పంచ్ శివకుమార్ అన్నారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చివరి గ్రామ పంచాయతీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాలకవర్గాన్ని, గ్రామ స్థాయి అధికారులను శాలువాలతో సన్మానించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ మార్టిన్ లూథర్, వైఎస్ ఎంపీపీ వెంకట నర్సింగ్‌రావు హాజరయ్యారు. ఈ మేరకు సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో పాలకవర్గం సహకారంతో గతంలో లేని అనేక అభివృద్ధి పనులు నిర్వహించామని గుర్తు చేశారు. ప్రత్యేకంగా గ్రామ పల్లె ప్రకృతి వనం, రోడ్లు, మురికి కాల్వలు, కరెంట్ స్తంభాలు, మంచి నీటి సౌకర్యాలు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండటం మర్చిపోలేని అనుభూతి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కడారి నాగరాజు, వార్డు సభ్యులు వాణి, వెంకటేష్, మల్లాగౌడ్, ప్రసాద్, దుర్గేశ్, నిలా శంకర్, అంజమ్మ, కో ఆప్షన్ సభ్యులు శోభ, విష్ణు, ఆశ వర్కర్ సంధ్య, వీవో కవిత, కార్యదర్శి సుల్తానా బేగం, మినీ అంగన్‌వాడీ నీలా, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థాయి అధికారులను సన్మానిస్తున్న సర్పంచ్

ఆర్థిక సాయం

శివంపేట (నర్సాపూర్): అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న పేద కుటుంబానికి చెందిన వ్యక్తికి చికిత్స కోసం దాతలు శనివారం ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన జోగు మహేశ్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా రూ.5000, గ్రామ బీఆర్ఎస్ నాయకుడు చింత స్వామి రూ.2000 చికిత్స కోసం బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించే బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు కోరారు. ఆదివారం మెదక్ వైస్రాయ్ గార్డెన్‌లో నిర్వహించే ఈ సమావేశానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావు హాజరుకానున్నట్లు తెలిపారు.

ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

కొల్చారం(నర్సాపూర్): త్వరలో జరగబోయే 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను, ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి నీలకంఠం విద్యార్థులకు సూచించారు. శనివారం వరిగుంతం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పర్యవేక్షించారు. విద్యార్థుల నుంచి సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నలు వేస్తూ సమాధానాలను రాబట్టారు. జరగబోయే బోర్డ్ ఎగ్జాంకు అందరూ విద్యార్థులు సన్నద్ధమై ఉండాలని సూచించారు. విద్యార్థులకు సకాలంలో తరగతుల నిర్వహణతో పాటు పరీక్ష ప్రాక్టీస్ టెస్టుల నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనానికి విద్యార్థులు యథావిధిగా సమయానికి అందించాలని సూచించారు.



పాఠశాలలో ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ

నేడు షేక్ షాబుద్దీన్ దర్గా ఉర్సు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రం గ్రామంలోని ప్రసిద్ధ షేక్ షాబుద్దీన్ దర్గా ఉర్సు ఉత్సవాలు ఆదివారం జరగనుందిఇందుకోసం దర్గాను సిద్ధం చేశారు. ఉర్సు ఉత్సవాలపై ముబారక్ దర్గా నిర్వాహకులు షాబుద్దీన్, ఖదీర్ మాట్లాడారు.